క్లుప్తంగా

ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలి

తాళ్లరేవు: వరి సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే, రైతులంతా సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు. బుధవారం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమాన్ని చేపట్టారు. పోలేకుర్రు పంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీఏఏ వైదాడి దేవి మాట్లాడుతూ ఎలుకల వల్ల పంటలకు కలిగే నష్టం, వాటి నివారణా చర్యలను వివరించారు. ఎకరానికి 200 గ్రాముల బియ్యపు నూకలో 4 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును నూనెతో బాగా కలిపి ఎలుకల బొరియల్లో పెట్టాలన్నారు. రైతులంతా సామూహికంగా ఈ కార్యక్రమం చేపట్టం ద్వారా మంచి ఫలితం ఉంటుందన్నారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణ మందును పంపిణీ చేశారు.

పలు కుటుంబాలకు పరామర్శ



అప్పలస్వామి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

కాట్రేనికోన: ఇటీవల అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ నాయకులు మృతి చెందగా, ఆ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పరామర్శించారు. కందికుప్పలో కాశి వెంకట్రావు మృతి చెందడంతో ఆయన కుమారుడు భరత్‌ను, పల్లం శివారు గోపాలరావుపేటలో బొజ్జా అప్పలస్వామి మృతి చెందడంతో ఆయన కుమారుడు రవిని సతీష్ కుమార్ ఓదార్చారు. రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిశోర్, వల్లభుని దొర బాబు, నల్లా నరసింహమూర్తి, కోలాటి సత్యం, గంటి వెంకట సుధాకర్, నల్లా రాంబాబు ఉన్నారు.

కౌలు రైతు మృతి



కృష్ణ (ఫైల్)

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన కౌలు రైతు టేకుమూడి కృష్ణ (55) పాము కాటుకు గురై మృతి చెందాడు. మంగళవారం తాను సాగు చేస్తున్న పొలంలో పనులు చేస్తుండగా గడ్డిమేటు వద్ద పాము కాటువేసింది. స్థానికులు యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, సర్పంచ్ పంపన రామకృష్ణ తదితరులు పరామర్శించారు.

పీ-4పై అవగాహన

అల్లవరం: గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో పీ-4పై బుధవారం మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడారు.

నేడు వార్షికోత్సవ సభ

అమలాపురం టౌన్: కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో 63వ వార్షికోత్సవ సభ గురువారం జరగనుంది. సాయంత్రం మూడు గంటలకు దువ్వూరి ఫణి యజ్ఞేశ్వర సోమయాజులు ఘనపాఠి అధ్యక్షతన వేద సభ జరుగుతుంది. ఈ సభకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేద ఘనపాఠీలు, వేద పండితులు హాజరుకానున్నారు. సంస్థ అధ్యక్షుడు గుళ్లపల్లి ప్రభాకరరాజా, కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రావ్, సంస్థ కార్యవర్గ సభ్యులు గురువారం వామన పూజ చేసి ఈ క్రతువుకు శ్రీకారం చుడతారు.

ఎమ్మెల్యేను కలసిన ఎస్పీ

యానాం: స్థానిక ఎస్పీగా నియమితులైన వరద రాజన్ బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు.

స్పందించిన ఎస్సీ కమిషన్

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఎస్సీల సంక్షేమ పథకాల అమలుకు విఘాతంగా మారిన జీఓ నంబరు 5పై జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ స్పందించింది. ఈ మేరకు యానాం నియోజకవర్గ పరిధిలో దరియాలతిప్ప గ్రామ పెద్దలు కమిడి బాలయోగి, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

డిగ్రీ కళాశాల ప్రారంభం

అమలాపురం రూరల్: పేరూరులో డీఎస్ శెట్టి-డీవీ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహ స్వామి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కళాశాలలో మూడు డిగ్రీ కోర్సులు ఉన్నాయని అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ డ్రైయ్యర్లు

కాట్రేనికోన: ఎండు చేపలు, రొయ్యలు సులభతరంగా ఎండబెట్టేందుకు నాబార్డు నిధులతో మహిళలకు రాయితీపై సోలార్ డ్రైయ్యర్లను బుధవారం పల్లంలో అందజేశారు. నాబార్డు నిధుల నుంచి స్వరాజ్య అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువ చేసే 5 సోలార్ డ్రైయ్యర్ యూనిట్లను రాయితీపై ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర చైర్మన్ తుమ్మల రామస్వామిబాబు అందించారు.



వరద నీటితో నిండిన సావిత్రినగర్ శ్మశానవాటిక



దొమ్మేటిపేట శ్మశాన వాటికలో ముళ్ల పొదలు

దూరమై... భారమై

- ఆఖరు మజిలీకి అవస్థలు
- దయనీయ స్థితిలో శ్మశాన వాటికలు
- కనీస సదుపాయాలు మృగ్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

యానాం: అయిన వారు దూరమయ్యారని బాధ ఒకపక్క.. అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి సరైన సౌకర్యాలు లేక క్షోభ మరోపక్క ఆయా గ్రామస్తులను వేధిస్తోంది. తీర ప్రాంత గ్రామాలు, గోదావరి తీరంలో ఉన్న శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు లేక ప్రజలు మనోవేదనకు గురవుతున్నారు. దళిత, మత్స్యకార గ్రామాల శ్మశాన వాటికల గురించి కనీసం పట్టించుకునే వారే కరవయ్యారు. ఈ పరిస్థితి మారేదెన్నడోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సావిత్రినగర్ శ్మశానవాటిక ఏళ్ల కాలం నుంచి అభివృద్ధికి నోచుకోవడం లేదు. గోదావరికి వరద వస్తే ముంపు నీటే ఉంటుంది. కనీస సౌకర్యాలు లేక అంత్యక్రియలకు అవస్థలు ఎదురవుతున్నాయి. ఏళ్ల తరబడి తుప్పలు, చెత్తతో నిండిపోయినా సంబంధిత పీడబ్ల్యూడీ సిబ్బంది సైతం పట్టించుకోవడం లేదు. నియోజకవర్గ శివారులో ఉన్న సావిత్రినగర్ మత్స్యకార గ్రామ శ్మశాన వాటికకు వెళ్లడానికి సరైన రహదారి లేదు.



బురదనీటిలో ఇలా వెళ్లాల్సిందే..

గోదావరికి వరదలు వచ్చినా, భారీ వర్షాలు పడినా శ్మశానం నిండా నీరు చేరుతోంది. మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడానికి అవస్థలు పడుతున్నారు. ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో నిండి ఉంటుండటంతో స్థానిక యువకులే ఒక్కోసారి శుభ్రం చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక యువత అధ్యక్షుడు మల్లాడి రాజు ఆవేదన వ్యక్తం చేశారు.

దొమ్మేటిపేటలోనూ అదే పరిస్థితి..

నియోజకవర్గానికి శివారున ఉండే దొమ్మేటిపేట ఎస్సీ గ్రామానికి గోదావరి ఒడ్డున ఉన్న ఒక సెంటు భూమిలో శ్మశాన వాటిక ఉంది. అక్కడకు వెళ్లేందుకు కనీసం దారిలేదు. దీనికి తోడు చుట్టూ ముళ్లపొదలతో పాటు ఆ స్థలంలో చుట్టుపక్కల ఉన్న ఫ్యాక్టరీల వారు వ్యర్థాలు పడేస్తుండడంతో ఆక్రమణలకు గురవుతుంది. గోదావరికి వరదలు వస్తే పూర్తిగా మునిగిపోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికను మట్టితో చదును చేయించాలని, రహదారి నిర్మించాలని వారు కోరుతున్నారు.

ముంపు.. ముళ్లపొదలు

భీమ్‌నగర్ దళితుల శ్మశాన వాటికలో సైతం కనీస సదుపాయాలు లేవు. గోదావరికి పక్కన ఉన్న ఈ రుద్రభూమిలో వరదలు, వర్షం వస్తే అది కాస్తా ముంపునకు గురవుతుంది. ముఖ్యంగా భీమ్‌నగర్, వికాస్‌కాలనీ, సిద్ధార్థనగర్, యూకేవీ నగర్ తదితర దళిత గ్రామాలకు చెందిన వారు ఈ రుద్రభూమిని ఉపయోగించుకుంటారు. మెట్టకూరు గ్రామంలో ఉన్న రుద్రభూమిని యానాం పట్టణంలో దాదాపు సగం మంది వినియోగించుకుంటున్నారు. ఈ శ్మశాన వాటిక ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తుంది. దీంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ముంపునీటితో అస్తవ్యస్తం



సావిత్రినగర్ శ్మశానవాటికలో **కనీస సదుపాయాలు** లేవు. **గోదావరికి వరదలు వ**చ్చినా, వర్షాలు **పడినా నీటితో** నిండిపోతుంది. **రహదారి, విద్యుత్**, తాగునీరు లేవు. అర కిలోమీటర్ **మేర బురదనీటిలో** చితికి అవసరమయ్యే పుల్లలు **తీసుకెళ్లాలి. అంత్య**క్రియలకు తీవ్ర ఇబ్బందులు **పడుతున్నాం. 2022**లో సావిత్రినగర్ శ్మశాన వాటి**కలో మౌలిక సౌక**ర్యాలకు సీఎస్ఆర్ నిధులు మం**జూరు చేసినా ఇప్ప**టివరకూ పనులు చేయలేదు.

– మల్లాడి రాజు, సావిత్రినగర్ యువత అధ్యక్షుడు

నేటి నుంచి వలీబాబా ఉత్సవాలు

ముమ్మిడివరం: కొత్తలంకలో వలీబాబా దర్గాలో గురువారం నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీనికి దేశం నలుమూలల నుంచి వేలాది మంది హిందూ, ముస్లిం భక్తులు తరలి రానున్నారు. మౌనమే భాష, సేవే ధ్యానం, పరోపకారమే జీవిత పరమార్థంగా బాబా దివ్య సందేశాన్ని భక్తులకు అందించారు. నల్గొండ జిల్లా గొల్లేపల్లి మండలం వలికొండ గ్రామానికి చెందిన వారని, 1818లో జన్మించారని సమాధి వద్ద సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. నైజాం నవాబుల కాలంలో మూసి నదికి వచ్చిన వరదల సమయంలో బాబా కోనసీమలో ప్రముఖ శైవక్షేత్రమైన కుండలేశ్వరం వచ్చారని పూర్వీకులు చెబుతారు. అనంతరం కొత్తలంక గ్రామంలో నివాసం ఏర్పాటు చేసుకుని కొత్తలంక బాబాగా ఖ్యాతి పొందారు. నీళ్లపై నడవడం, వర్షంలో తడవక పోవడం వంటి మహిమలను అప్పటి ప్రజలు స్వయంగా చూసేవారని నానుడి. 1948 జనవరి 22న బాబా తన దేహాన్ని త్యజించారు. 1953లో బాబా సమాధిపై దర్గాను నిర్మించారు. ఇక్కడ ప్రతి ఏడాది వెంకటరత్నం వారసులు ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా గురువారం గంధం పూయడం, శుక్రవారం దీపారాధన, శనివారం 'జయారత్' కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు దర్గా నిర్వాహకుడు గేదెల రఘునాథ్‌బాబా తెలిపారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



కొత్తలంక బాబా దర్గా వద్ద భక్తులు

మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో 74 షాపులతో ఉన్న అతి పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్), మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లపై మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సర్క్యులర్ బజార్‌లో రూ. 50 వేలు దాటి అద్దె బకాయిలు పడిన షాపులు 26 ఉన్నాయి. ఈ షాపులకు తాళాలు వేసేందుకు మున్సిపల్ రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రయత్నించారు. అయితే 26 షాపులకు గాను 12 షాపుల లీజుదారులు అప్పటికప్పుడే బకాయిలు చెల్లించారు. మిగిలిన 14 షాపులకు తాళాలు వేసి సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ కూడా సర్క్యులర్ బజార్‌ను సందర్శించి అద్దె బకాయిలు ఉన్న లీజుదారులతో మాట్లాడారు. సర్క్యులర్ బజార్‌లో 12 మంది లీజుదారులు మొండి బకాయిలు చెల్లించడంతో అక్కడే రూ.4.15 లక్షలు వసూలు చేశారు. అలాగే మార్కెట్‌లో 27 షాపులతో కాంప్లెక్స్ ఉంది. ఈ షాపుల్లో రూ.50 వేలు దాటి అద్దెల బకాయిలు ఉన్న షాపులు 4 ఉన్నాయి. అధికారులు స్పెషల్ డ్రైవ్‌కు వెళ్లగానే ఈ నాలుగు షాపుల లీజుదారులు రూ.1.54 లక్షలు అద్దె బకాయిలు చెల్లించారు. స్పెషల్ డ్రైవ్‌లో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో మొత్తం రూ.5.69 లక్షల మొండి బకాయిలు వసూలైనట్లు రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. సర్క్యులర్ బజార్‌లో మరుగుదొడ్ల సౌకర్యం లేదని, పలు చోట్ల లీకులు అవుతున్నాయని, అయినా మున్సిపాలిటీ అద్దెలను ముక్కు పిండి వసూలు చేస్తోందని పలువురి లీజుదారులు కమిషనర్ నిర్మల్ కుమార్‌కు వివరించారు. త్వరలోనే సర్క్యులర్ బజారులో నెలకొన్న అసౌకర్యాలు తొలగించేందుకు పనులు చేపడతామని కమిషనర్ లీజుదారులకు చెప్పారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు.



అద్దె బకాయి ఉన్న మున్సిపల్ షాపును సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి, సిబ్బంది

పర్మినెంట్ చేయాలని వినతి

యానాం: యానాం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో గత 20 ఏళ్లుగా సేవలు అందిస్తున్న ఫుల్ టైమ్ క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ బుధవారం పుదుచ్చేరి గవర్నమెంట్ సర్వెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది పుదుచ్చేరి ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం రంగసామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికుల్లో కొద్ది మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేశారని, మిగతా వారిని పట్టించుకోలేదన్నారు. తమ ఉద్యోగాల పర్మినెంట్ చేయాలంటూ ఇచ్చిన ఫైల్ రాజ్‌నివాస్‌లో తుది ఆమోదం కోసం పెండింగ్‌లో ఉందన్నారు. రికార్డుల ప్రకారం ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థిక భారం లేకుండా కార్మికులందరినీ పర్మినెంట్ చేయడానికి తగిన ఖాళీలు 40 ఎంటీఎస్ పోస్టులతో సహా ఉన్నాయన్నారు. అంతకు ముందు ఎల్జీ కె.కైలాషనాథన్‌ను రాజ్‌నివాస్‌లో కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు శర్వణన్, అర్ముగం, ఆర్.కుమార్‌రాజా పాల్గొన్నారు.



తమను పర్మినెంట్ చేయాలని సీఎం రంగసామిని కలసిన కార్మికులు

భూ దస్తావేజుల అందజేత

అమలాపురం రూరల్: పెనికేరుకు చెందిన ముగ్గురు రైతుల నుంచి 1.72 ఎకరాలను నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పేరిట 2020లో సేకరించారని, ఆ భూమికి నష్ట పరిహారం అందలేదని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. అమలాపురం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ ఆ లబ్ధిదారులకు వేరేచోట భూమిని సేకరించి అందించామన్నారు. దీనికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులను బుధవారం పంపిణీ చేశామన్నారు.

- విదేశాలకు వెళ్లి స్థిరపడాలనుకునే కోనసీమ ప్రాంత వలసదారుల సంక్షేమం కోసం డీఆర్‌ఓ, వలసదారుల కేంద్ర నోడల్ అధికారి కె.మాధవి నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌లో ప్రొటెక్టర్ ఆఫ్ ఇమిగ్రెంట్ కేంద్ర కార్యాలయానికి అధ్యయనం కోసం వెళ్లిందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయి విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వారిని తిరిగి స్వదేశానికి రప్పించడంలో ఈ కేంద్రం కీలక భూమిక పోషించిందన్నారు. తొలుత ఆ బృందం కలెక్టర్‌ను కలసింది.
- హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచేందుకు జిల్లా స్థాయిలో మారథాన్ 5 రన్‌ను ఈ నెల 9న నిర్వహిస్తామని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.



కలెక్టర్‌ను కలిసిన వలసదారుల కేంద్ర నోడల్ అధికారి మాధవి బృందం

కొత్త కార్యవర్గాల ఎన్నిక

అమలాపురం టౌన్: ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎన్‌పీవో) ఆధ్వర్యంలో అమలాపురం పోస్టల్ డివిజన్‌లో పలు యూనియన్లకు కొత్త కార్యవర్గాలు స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఆ యూనియన్ల ప్రతినిధులు పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అమలాపురం డివిజన్ నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ గ్రూప్– సి కార్యదర్శిగా ఎం.ఏకాంబరం, అధ్యక్షుడిగా కె.ఆచార్యులు, నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్ట్‌మాన్ అండ్ ఎంటీఎస్ డివిజన్ కార్యదర్శిగా జి.సతీష్, అధ్యక్షునిగా బి.వెంకటరత్నం ఎన్నికయ్యారు. గ్రామీణ నేషనల్ యూనియన్ ఆఫ్ డాక్ సేవక్ డివిజన్ కార్యదర్శిగా వీవీ మహాలక్ష్మి, అధ్యక్షునిగా భీమార్జునరావు ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గ ప్రతినిధులను అభినందిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్

విజయమివ్వు విఘ్ననాయకా..

యానాం: స్థానిక ఉదయకృష్ణ వంశీనగర్‌లో కొలువైన శ్రీసిద్ధి వినాయక స్వామివారి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం అర్చకుడు శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం వైభవంగా జరిగింది. పోలిశెట్టి సత్యానందం, జయవీరమౌనిక దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీఎస్ నాయుడు కాలనీలో వరసిద్ధి వినాయస్వామి మందిరంలో స్వామివారికి విశేష పూజలు చేశారు.

ఐ.పోలవరం: స్థానిక పంచాయతీ పెదమడి గ్రామంలో కళ్యాణ రామశెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో గణపతి మండపం వద్ద ఏకాహ మహోత్సవం జరిగింది. శ్రీనివాస భక్త బృందం సభ్యుడు యనమదల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భజన కళాకారులు భక్తి గీతాలు ఆలపించారు. సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ కనకారావు, సానబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: వేట్లపాలెం గ్రామంలోని శెట్టిబలిజ సామాజిక వర్గ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా మహిళలచే విఘ్నేశ్వరునికి సహస్ర గరిక పూజ నిర్వహించారు. ముందుగా మంత్ర పుష్పం, సహస్ర గరిక అర్చన జరిగింది.

తాళ్లరేవు: సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించారు. శ్రీలక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. వర్తక సంఘం అధ్యక్షుడు పుగాకు వాసు, ప్రతినిధులు వనచర్ల రామకృష్ణ, అడబాల శివ, కాండ్రేగుల సతీష్, ఉండి మాణిక్యాలరావు పాల్గొన్నారు.



సుంకరపాలెం జంక్షన్‌లో లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



వేట్లపాలెంలో సహస్ర గరిక పూజ చేస్తున్న మహిళలు

దసరా ఉత్సవాలను సమష్టిగా నిర్వహిద్దాం

అమలాపురం టౌన్: పట్టణంలో దసరా ఉత్సవాల ఉరేగింపులు, చెడీ తాలింఖానా ప్రదర్శనలను అక్టోబర్ 2న విజయ దశమి రోజున జరపాలని ఆ ఉత్సవాలను నిర్వహించే 7 వీధుల కమిటీల ప్రతినిధుల సమావేశం తీర్మానించింది. అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో బుధవారం కమిటీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. వీధులు, ఉత్సవాల మధ్య అంతరాలు లేకుండా స్నేహ పూర్వక వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకుందామని సమావేశం స్పష్టం చేసింది. మహిపాల వీధి, కొంకాపల్లి, గండు వీధి, నల్లా వీధి, శ్రీరామపురం, రవణం వీధి, రవణం మల్లయ్యవీధి కమిటీల ప్రతినిధులు, ఆయా వీధుల పెద్దలు ఈ సమావేశాన్ని నిర్వహించి సమష్టి నిర్ణయాలు తీసుకున్నారు. కమిటీల ప్రతినిధులు తిక్కిరెడ్డి నేతాజీ, అబ్బిరెడ్డి సురేష్, పనసా బుజ్జి, చిక్కాల రాంబాబు, ఆశెట్టి ఆదిబాబు, దూడల ఫణి, రాయుడు సత్యరుషి, రవణం చిట్టి, మామిడిపల్లి రాము, బండారు రామోహన్, రవణం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు

యానాం: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజల వద్దకు వెళ్తానని, అడ్డంకులు తొలగుతుండటంతో వేగంగా పనులు అయ్యేటట్లు చూస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. బుధవారం మెట్టకూరులో రూ.58.90 లక్షలతో పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైస్కూల్ గ్రౌండ్ చదును చేయడం, 30 అడుగుల ప్రహరీ నిర్మాణం, క్రీడాకారులకు డ్రెస్సింగ్ రూమ్, నెట్ ప్రాక్టీస్ పిచ్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఈఈ నాగరాజు, జేఈ జ్యోతిరాజు, ప్రసాద్, హెచ్ఎం రాజారామ్ మోహన్, గ్రామ పెద్దలు మోర్త శ్రీనివాస్, పోతుల జయ, పాలిమారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాకి పతాకం ఆవిష్కరణ

అమలాపురం టౌన్: స్థానిక శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ సమీపంలో గల చతుర్థశ్యాంతిః యమ ధర్మరాజ దివ్య జ్ఞాన పీఠం వద్ద కాకి పతాకాన్ని బుధవారం ఆవిష్కరించారు. మానవ జీవితాలపై కాకుల ప్రభావం, మతాత్మలకు, కాకులకు ఉన్న అవినాభావ సంబంధం, మరణాంతరం జీవులను కాకులు ఏ విధంగా రక్షించి అనుగ్రహిస్తాయో అక్షయ పాత్ర వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణ భక్తులకు వివరించారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర ప్రతినిధులు నూకల కుమారి, కనకదుర్గ, అన్నపూర్ణ, దేవి, స్వరూప, ప్రసాద్, గొవ్వాల అచ్యుతరామయ్య, లింగోలు విస్సు, అరిగెల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ముమ్మిడివరం నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. యూత్ విభాగం అధ్యక్షుడిగా నడింపల్లి సందీప్‌వర్మ, మహిళా విభాగానికి రేవు మల్లీశ్వరి, రైతు విభాగానికి పొట్ల వీరవెంకట సత్యనారాయణ, బీసీ సెల్‌కు సానబోయిన మల్లికార్జునరావు, ఎస్సీ సెల్‌కు మోకా రవికుమార్, ఎస్టీ సెల్‌కు సూర్యనారాయణ, మైనార్టీ సెల్‌కు మీర్జాఅడమ్ బేగ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు ఎస్.సునీల్‌శాస్త్రి, విద్యార్థి విభాగానికి గంటి ఆకాష్, పంచాయతీ విభాగానికి చొల్లంగి వెంకటేశ్వరరావు, మున్సిపల్ విభాగానికి వేటుకూరి కరమ్ చంద్ బోసురాజు, ఆర్టీఐ విభాగానికి పొన్నాడ భైరవమూర్తి, వలంటీర్స్ విభాగానికి రేకాడి వర్మ, గ్రీవెన్‌సెల్‌కు మోర్త రాఘవులు, వాణిజ్య విభాగానికి సుంకర నాగబాబు, వీవర్స్ విభాగానికి ఊటుకూరి నాగభూషణం, వైఎస్సార్ టీయూసీకి బొంతు శ్రీను, లీగల్ సెల్‌కు కోన అర్జున్‌రెడ్డి, కల్చరల్ విభాగానికి పోతుల రత్నకుమారి, సోషల్ మీడియాకు పందిరిపల్లి రాజేష్, ఐటీ విభాగానికి కాశి శ్రీనివాస్, దివ్యాంగుల విభాగానికి పపుసులేటి అర్జున్, డాక్టర్స్ విభాగానికి మల్లాడి సత్యానందవర్మ, ఇంటెలెక్చువల్ ఫారమ్ విభాగానికి సూర్యనారాయణ (జేడీ), బూత్ కమిటీ విభాగానికి కోలా బాబ్జీ, పబ్లిసిటీ విభాగానికి వాసురాజు నియమితులయ్యారు.

అభివృద్ధిపై నేడు వర్క్‌షాపు

ఐ.పోలవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై వర్క్‌షాపు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కేఎల్ఎస్‌వీ శర్మ బుధవారం తెలిపారు. దీనికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలన్నారు.

ఏసీ బస్సుల్లో రాయితీ

అమలాపురం రూరల్: అమలాపురం డిపో నుంచి విజయవాడ, విశాఖపట్నం వెళ్తున్న ఏసీ ఇంద్ర సర్వీసుల్లో ప్రయాణికులకు టిక్కెట్ చార్జీలో 10 నుంచి 15 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ స్‌టీవీ రాఘవకుమార్ తెలిపారు. అమలాపురం డిపో నుంచి హైదరాబాద్ నైట్ రైడర్ సర్వీసుల్లో 15 శాతం, అమలాపురం నుంచి వయా రావులపాలెం మీదుగా శంషాబాదు ఇంద్ర సర్వీసులో (సర్వీసు నెంబర్ 2562 – 2563) పది శాతం, విజయవాడ, విశాఖపట్నం రూట్లలో నడుపుతున్న ఇంద్ర ఏసీ సర్వీసుల్లో పది శాతం రాయితీ కల్పిస్తున్నామని వివరించారు. ఈ అవకాశం ఈ నెల 23వ తేదీ వరకు మాత్రమే ఉందన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

అమలాపురం టౌన్: నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రాతి బడి వద్ద పేదలకు వస్త్రదానం, హెచ్ఐవీ రోగులకు అన్నదానం చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ముమ్మిడివరం: స్థానిక శ్రీవెంకటేశ్వర కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా పల్లవారిపాలెం గ్రామానికి చెందిన చిక్కం శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ ఎ.రాధాకృష్ణారావు నుంచి ఉత్తర్వులు అందాయి. శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడి



నిరసన తెలుపుతున్న పేదాంధ్రపేట గ్రామస్తులు

అల్లవరం: ఒక రోజంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బంది పడినా విద్యుత్ అధికారులు కనీసం పట్టించుకోలేదని దేవగుప్తం పేదాంధ్రపేట గ్రామానికి చెందిన ప్రజలు అల్లవరం సబ్ స్టేషన్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. మంగళవారం సాయంత్రం నుంచి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడంతో అమలాపురం ఏడీ, అల్లవరం సబ్ స్టేషన్ ఏఈకి ఫిర్యాదు చేసినా స్పందించదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఒక రోజు గడిచినా ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో గెద్దం ఏడుకొండలు, నేల శివాజీ, గెద్దం వెంకటరమణ, అయితాబత్తుల బాలు, కారుపల్లి రాఘవ, చోడే ఏడుకొండలు, నేల రాంబాబు పాల్గొన్నారు.

ఆశ్రమంలో పూజలు

ముమ్మిడివరం: స్థానిక భగవాన్ శ్రీబాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని ఢిల్లీకి చెందిన ఐఏఎస్ అధికారి బాలకిరణ్ బుధవారం సందర్శించారు. ఆశ్రమంలో బాలయోగీశ్వరుల దివ్య సమాధుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.